# టార్చిలైటు

'కరుణకుమార'

రెడ్డిపాలెం అని ఓ చిన్నపల్లెటూరు. ఈగ్రామంలో బోర్డు ఎలిమెంటరీస్కూలు పెట్టి ఓసంవత్సరంకూడా కాలేదు. అంతకుపూర్వం ఓ వైదికాయన వీధిబడి పెట్టుకొని పదిమంది పిల్లకాయలకి చదువు చెప్పుకుంటూ ఉండేవాడు. నిరుడుసంవత్సరం జిల్లాబోర్డు ఎన్నికలలో గరటయ్య అని ఆ పక్కవూరు రైతు ఒకాయన గెలిచి, ప్రెసిడెంటు అయ్యాడు. ఆయనగారికి రెడ్డిపాలెం అంటే ఎంతో మోజు. ఆ రెడ్డిపాలెంలో పదియిళ్లవాళ్లు కాపులు బలవంతులున్నారు. తెల్లవారి లేస్తే వాళ్లదగ్గర ఇంత తెచ్చుకోవడం, ఇవ్వడం, వాళ్లకీ వాళ్లకీ తోంభయి లావాదేవీలు. అందువల్ల తన ప్రెసిడెంటుగిరీలో ఆ గ్రామానికి కొన్ని శాశ్వతమయిన ఉపకారాలు చేయాలని, మీటింగులో బోర్డు స్కూలు మంజూరు చేయించి, పదిహేను వందల రూపాయలతో బిల్డింగు కట్టించి, వీధిబడిలో చదువుకొనే పిల్లకాయల నందరినీ బోర్డుస్కూలులో చేర్పించాడు ప్రెసిడెంటు.

ఇద్దరు టీచర్లకు చాలినంతమంది పిల్లలు లేనందువల్ల పేటలమీద తిరిగే చాకలి, మంగలి, కుమ్మరి, వొడ్డె, సాలె, గొల్ల, యానాదివగైరా ప్రతి పిల్లకాయనీ తీసుకువచ్చి ఓ అరవయిమందిని పోగుచేసి ఆ స్కూలులో చేర్పించాడు ఆ ప్రెసిడెంటు.

ఈ సంవత్సరమే కొత్తగా పెట్టిన స్కూలయినందువల్ల ఈయేడు ఈస్కూలులో కూడా ఆరోగ్యవారం జరిపి, పిల్లకాయల చేత ఆటలాడించి, బహుమతు లివ్వవలసిందని ప్రెసిడెంటుగారి దగ్గరనుండి హెడ్మాష్టరుకు తాఖీదు వచ్చింది. అయితే, దీని కయ్యే ఖర్చులు జిల్లాబోర్డు భరించుకొనే స్థితిలో లేనందువల్ల గ్రామంలోని రైతులవల్లా, గ్రామస్థులవల్లా తలా కొంచెం చందాలు వేయించి, ఆ పైకంతోనే ఆరోగ్యవారం జరపవలసిందని కూడా ఆ తాఖీదులోనే వ్రాశారు ప్రెసిడెంటుగారు.

ఆ హెడ్మాష్టరు క్రైస్తవుడు. పేరు జకరయ్య. పాపం బీదవాడూ, భయస్థుడూను. ప్రెసిడెంటుగారి ఉత్తరువు తీసుకొని వెళ్లి గ్రామంలో పదిమందిపెద్దలకూ చూపి, తలా కొంచెం చందావేసి సహాయం చేయవలసిందని కోరాడు జకరయ్య. ఈ ఆరోగ్యవారాలూ, వేడుకలూ, వీటి ఉపయోగాలూ వాళ్లకంతగా అర్థమైనా కాకపోయినా, ఏమో పిల్లకాయలచేత ఆటలాడించి బహుమతు లిస్తానని అంటున్నాడు అయ్యవారు, అని పదిమంది కాపులూ, బ్రాహ్మలూ, గ్రామాధికార్లూ కలిసి చందాలువేసి, ఓ యిరవై రూపాయలు జమచేసి, అతనిచేతిలో పెట్టారు.

స్కూళ్ల డిప్టీ ఇన్స్పెక్టరును పిలుచుకొనివచ్చి, ఆయనసమక్షంలోనే పిల్లకాయల చేత అరమైలు పరుగు, నూరుగజాల నడక, ఎక్కువయెత్తు ఎగరడం, ఎక్కువపొడుగు దూకడం, బల్లలకింద కాళ్లకు గోతాలు కట్టుకొని నడవడం, కిందచల్లిన పువ్వు లేరి కుప్పగా పెట్టడం- ఒకరకమేమిటి, పట్నవాసపుబడులలో ఆడించే ఆటలన్నీ పిల్లకాయల చేత ఆడించి, ఆటల్లో గెలుపొందిన పిల్లకాయలకు — ఒకరికి సూటుకేసూ, ఇంకొకరికి టార్చిలైటూ, మరొకరికి పెద్దసైజు జపాను అద్దం, ఇంకొకరికి ఫౌంటెన్ పేనా, వేరొకరికి సబ్బుపెట్టే, ఇంకొకరికి గొడుగూ - ఇట్లాగే తలా ఒకవస్తువు బహుమతీలు యిచ్చాడు.

కాని ఆరాత్రికే గ్రామంలో అల్లకల్లోలం బయలుదేరింది.

ఆటల్లో గెలిచి బహుమతులు తీసుకొన్న పిల్లకాయ లందరూ — ఒకడు చాకలివాడు, ఇంకొకడు మంగలివాడు, మరొకడు వొడ్డెవాడు, యానాదివాడు, సాలెవాళ్లపిల్ల, కుమ్మరివాళ్లపిల్ల - ఈరకంగా అందరూ బీదవాళ్ల పిల్లకాయలే. గ్రామంలో డబ్బుగలవాళ్లూ, గొప్పవాళ్లూ, పలుకుబడిగలవాళ్లూ ఇచ్చిన డబ్బుతో వస్తువులు కొనడమూ, ఆ వస్తువులు చివరకు వాళ్ల చేతికింద నీళ్లు తాగే నౌకర్లపిల్లకాయ లెత్తుకొనిపోవడమూ జరిగింది.

గ్రామస్థులు కుతకుత ఉడికిపోతున్నారు. తమ పిల్లకాయలకు వస్తాయనుకొన్న వస్తువులన్నీ కూటికీ గుడ్డకూ మొగంవాచిన దరిద్రజీవుల సంతానం ఎత్తుకొనిపోయారు. అందులో తమ స్వగ్రామంలో, తమ కళ్లఎదుట తెల్లవారి లేస్తే తమ చెప్పు చేతల్లో ఉండి, తమకింద తాబేదారీ పనిచేసే నౌకర్ల బిడ్డలకు బహుమతులూ, తమ బిడ్డలకు వొట్టిచేతలూను. పెద్దరెడ్డిగారి అబ్బాయి ఒకటేగోల! కరణంగారి అబ్బాయి ఇంట్లోవాళ్లని నిలవనివ్వడం లేదు. సాలెవాళ్ల కిచ్చిన అద్దం తెచ్చి నా కిస్తావా చస్తావా అని కాశయ్యకూతురు ఒకటే ఏడుపు! ఇంతెందుకు, చాకలివాళ్లూ, మంగలివాళ్లూ, కుమ్మరివాళ్లూ అందరూ సంతోషంతో పొంగిపోతూ పండగ చేసుకొంటూ ఉంటే పెద్ద గ్రామస్థుల ఇళ్లల్లో ఆరోజు రోజంతా ఎండగలూ, ఉపవాసాలూను.

హెడ్డుమాస్టరు జకరయ్య కావలె నని వాళ్లందరికీ ఈ అవమానం చేశాడని వాళ్ల నమ్మకం. ఊళ్లో పెద్దలనుకొనే పదిమందీ చేరి కూడబలుక్కున్నారు. ఆ మర్నాడు ఉదయాన్నే మీటింగు పెట్టి జకరయ్యను పిలిపించి, "మాదగ్గిర డబ్బులు దండి, ఊళ్లో వాళ్లకి పంజారం చేస్తావా! ఇంత తలపొగరా నీకు! మాడబ్బుతో కొన్న వస్తువులు మళ్లీ వాపసు తీసుకొనివచ్చి, మా పిల్లకాయలకు పంచిపెడుతావా లేక నిన్ను పట్టుకొని మెత్తగా తన్నమంటావా?" అని పదిమందీ కస్తీ చేశారు.

జకరయ్య గడగడలాడిపోయాడు. ఒంటరిగాడు. గ్రామంలో పెద్దవులు లనుకొనే వాళ్లందరూ చేరి చేసిన పంచాయతీ. అదిగాక, పబ్లికు మీటింగులో డిప్టీ యిన్స్పెక్టరుగారి సమక్షంలో పంచిపెట్టిన బహుమతీ వస్తువులు— వాటిని మళ్లీ తాను పైరివేటుగా ఊడబెరుక్కోవచ్చునా? ఈ సంగతి జిల్లా

బోర్డు ప్రెసిడెంటుగారికి తెలిస్తే తన నౌకరీకి మోసం కదూ. మరి తీసుకురాకపోతే గ్రామస్థులు బ్రతకనిస్తారా?—

గండకత్తెర చుట్టుకొన్నట్టున్నది అతగాడికి.

జకరయ్య అట్టే ఆలోచించి, "స్వామీ! మీకు దణ్ణం పెట్టుతా. ఈ బహుమతులిచ్చిన వస్తువులు వాపసు తీసుకొనివచ్చే పని నా నెత్తిన పెట్టకండి. మీ రందరూ చేరి నామీద నేరం పెట్టారు కాబట్టి, నాస్వంత డబ్బుతో ఆ వస్తువులు మళ్లా కొత్తవి కొని మీకు ఇచ్చుకొంటాను. అంతమాత్రం దయ పెట్టండి" అని వాళ్ల కాళ్లు పట్టుకొన్నాడు.

కాని, వా రంతా పెద్దమనుష్యులు - ఒప్పుకొంటారా వారు? జకరయ్య ఎంత చెప్పినా, ఎన్నివిధాల ప్రార్థించినా, 'ఆవస్తువులు ఆ పిల్లకాయలదగ్గర ఉండడానికి మాత్రం వీలు లేదు. పోయి నీవు వాపసు తీసుకొని వస్తావా రావా?' అని వాళ్లు నిక్కచ్చి చేశారు.

జకరయ్యకు దిక్కుతోచక, ఆవెళ్లడం వెళ్లడం ఏకాయెకీని జిల్లాబోర్డు ప్రెసిడెంటు దగ్గరికి వెళ్లి, జరిగిన విషయమంతా ఆయనతో మనవి చేసుకొని, రక్షించండని ఆయన కాళ్లమీద పడ్డాడు.

ఆ ప్రెసిడెంటు అసాధ్యుడు; రాజకీయవేత్త; దూరాలోచనపరుడు. ముందుసంవత్సరం రాబోయే ఎన్నికల్లో శాసనసభకి కూడా నిలబడాలని చూస్తున్నాడు. జకరయ్య చెప్పుకొన్న దంతా విని "నేను రేపు మీగ్రామానికి వచ్చి, గ్రామస్థులతో స్వయంగా మాట్లాడి, వ్యవహారం పరిష్కారం చేస్తా. నీ కేం భయం లేదు, పో"మ్మన్నాడు.

జకరయ్య ప్రెసిడెంటుదగ్గరకు పోయిన సంగతి గ్రామస్థులకు తెలిసి, వాళ్లు వెంటనే బహుమతులు తీసుకొన్న పిల్లకాయల తల్లిదండ్రులను రచ్చకు పిలిపించి, బెదరించి, వాళ్లదగ్గరి వస్తువులన్నీ వాపసు తీసుకుని, పెద్దరెడ్డి స్వాధీనంలో పెట్టుకొన్నారు.

భయపడి వస్తువులు అందరూ వాపసు యిచ్చారు కాని, టార్చిలైటు తీసుకొన్న చాకలివాళ్ల పిల్లవాడు మాత్రం వాపసు ఇవ్వలేదు. వాడితండ్రి రంగం, మోల్మేను వగైరాపట్నాలు తిరిగి వచ్చినవాడు; మనిషి — ఎర్రగా నేత్రాలూ వాడూ ఆజానుబాహువు - ఏడడుగులు ఎత్తుంటాడు. చేతులకు మురుగులు, దండకడియం, అయిదువేళ్లకీ ఉంగరాలు, మొలకు బిళ్లల మొలతాడు, చెవులకు తమ్మెట్లు — చూడ్డానికే మహాజబర్దస్తీగా ఉంటాడు. గ్రామస్థు లెంత బెదిరించినా వాడు టార్చిలైటు వాపసు ఇవ్వకుండా మొండొడ్డుకొని కూర్చున్నాడు. పైగా, ఇచ్చినవాళ్లనికూడా చీవాట్లు పెట్టి పురెక్కించాడు.

మరునాడు ఉదయం జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారు గ్రామానికి వచ్చేవరకు వస్తువులు చేజారి వాపసు యిచ్చినవాళ్లూ, వాళ్ల బంధువులూ, చాకలివాళ్లూ మొదలయిన అలగాజనం అందరూ ఓ యేభయిమంది తోడయి, పెద్దరెడ్డి యింటిమీద పడి, 'చాకలివాడు వస్తువు ఇవ్వనిదీ మేము మాత్రం వాపసు ఇస్తామా, మావస్తువులు

మా కిచ్చివేయవలసిం' దని కర్రలూ కత్తులూ పట్టుకు తయారయారు.

ఇంతలో జిల్లా బోర్డు ప్రెసిడెంటుగారు రాగానే వారిని పెద్దరెడ్డియింటికి పిలుచుకొనిపోయి బస చేయించారు.

పదిగంటలదాకా ఎవరెవరు ఏమేమి మాటాడుకొన్నారో అంతా గోప్యంగా జరిగిపోయింది. పదకొండుగంటలకు కారెక్కి హెడ్ క్వార్టర్సుకు చక్కా వెళ్లిపోయాడు ప్రెసిడెంటు.

రంగం చాకలివాడి హుషారీ చూచుకొని అలగాజన మంతా ఏకమై నడుములు బిగిస్తున్నారు. పెద్దరెడ్డి వీథిలోకి రావడం మానేసి రహస్యంగా మాలవాళ్లకు చెప్పి పంపి, కల్లు పోయిస్తాననీ, డబ్బు లిస్తాననీ బేరాలు చేస్తున్నాడు.

వ్యవహారం ముదిరి కొట్టుకోవడం దాకా వచ్చేవరకు, మునసబు కరణాలు చల్లగా తప్పుకొని, గ్రామపరిస్థితులు పోలీసువారికీ, మేజస్ట్రేటుకీ రిపోర్టు పంపించారు.

గ్రామంలో అయితే జకరయ్య ప్రస్తావన మళ్లా ఏమీ లేదుకాని, గ్రామస్థులతో మాట్లాడి ప్రెసిడెంటుగారు వెళ్లిపోయిన తరువాత ఒకనాటి ఉదయం జకరయ్యకు పోస్టులో ఓకవరు వచ్చింది. అది చింపి చూస్తే ఇట్లా ఉంది:

జిల్లాబోర్డు ఆఫీసు,
తే ౧౬-౧౧-౩౯.

ఉత్తర్వు

ఇటీవల మీ గ్రామంలో జరిగిన ఆరోగ్య శిశువార వేడుకల సందర్భంలో మీరు అజాగ్రత్తగా ప్రవర్తించి, గ్రామంలో అనవసరమైన కలతలూ, పార్టీలూ పెంచి, పాఠశాల పురోభివృద్ధికే కాక, గ్రామ పురోభివృద్ధికికూడా భంగకరంగా నడచుకొన్నందువల్ల మీరు స్కూలు టీచరుగా ఉండడానికి అనర్హు లని తీర్మానించి, మీ సంజాయిషీతో నిమిత్తం లేకుండానే మిమ్మల్ని ఈ తేదీ లగాయతు నౌకరీనుండి మర్తరబు చేయడమైనది.

(సం) గరటయ్య,
ప్రెసిడెంటు.